ఇంటింటికీ కష్టాలే..

- ఇంటి వద్దకే రేషన్ రద్దుపై లబ్ధిదారుల అసంతృప్తి
- పేదల కడుపుకొట్టడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని విమర్శలు
- తమ బతుకులను రోడ్డు పాలు చేయొద్దంటున్న ఎండీయూ ఆపరేటర్లు

ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు రేషన్ సరుకులను అందించే ఎండీయూ వాహన సేవలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల కడుపు కొట్టేందుకే ప్రభుత్వం అన్నింటినీ రద్దు చేస్తోందని విమర్శిస్తున్నారు. ఏ పనులు మానుకోకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దనే సరుకులు పొందామని, ఇప్పుడు పనులు మానుకొని, మళ్లీ గంటల తరబడి రేషన్ దుకాణాల ముందు నిరీక్షించేలా చేస్తుండటం అత్యంత బాధాకరమని వాపోతున్నారు. - సాక్షి బృందం



ప్రభుత్వ నిర్ణయం సరికాదు



జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా క్రమం తప్పకుండా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులను సక్రమంగా అందిస్తున్నాం. ప్రభుత్వం ఉన్న ఫలంగా ఎండీయూ వాహన సేవలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం సరికాదు. ఉన్న ఫలంగా తొలగిస్తే ఎండీయూ ఆపరేటర్లందరూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- నాగరాజు, ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు

మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి



కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్యల వలన రాష్ట్రవ్యాప్తంగా 18 వేల మంది ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వ నిర్ణయాలను అక్కసుతో వ్యతిరేకిస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా ఎండీయూ వాహనాలను అర్ధాంతంగా తొలగించింది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలి.

- పోలేపల్లి సోమశేఖర్, రొద్దం

పాత విధానాన్నే కొనసాగించాలి



ఎండీయూ ఆపరేటర్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అర్ధాంతరంగా మమ్మల్ని రాష్ట్ర ప్రభుత్వం తొలగించడం అన్యాయం. వయసు రీత్యా మాకు వేరే ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరకవు. మా జీవితాలు రోడ్డున పడతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని కోరుతున్నాం.

- సీ శ్రీనివాసులు, పరిగి

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం



మాకు ప్రభుత్వం అన్యాయం చేసింది. న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తాం. 2021 సంవత్సరం నుంచి రేషన్ కార్డు లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సక్రమంగా ఇంటి వద్ద వెళ్లి లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేస్తున్నాం. లబ్ధిదారులు కూడా ఈ స్కీమ్ బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. కానీ ఏ తప్పు చేశామని మమ్మల్ని తొలగించారు. దీని వల్ల మా కుటుంబాలు ఎంతో క్షోభను అనుభవిస్తున్నాయి.

- ఫయాజ్, ఎండీయూ ఆపరేటర్, మడకశిర

అగ్రిమెంట్ ఉన్నా రద్దు చేయడమేంటి?



కరోనా కాలంలోనూ ఎంతో సమర్థవంతంగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్‌ను సరఫరా చేశాం. లబ్ధిదారులు కూడా ఎంతో సులువుగా సరుకులు పొందేవాళ్లు. ఎండీయూ వాహన సేవలను ప్రభుత్వం రద్దు చేయడంతో మా కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. లబ్ధిదారులకు కూడా ఇబ్బందులు తప్పవు. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉన్నా అర్ధాంతరంగా వ్యవస్థను రద్దు చేయడమేంటి?

- కృష్ణ , ఎండీయూ ఆపరేటర్, అగళి

ఇంటింటికీ రేషన్ రద్దు సరికాదు



గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పథకం చాలా బాగా నిర్వహించేది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా తూకాల్లో మోసం లేకుండా ఇంటి వద్దకే వచ్చి ఎండీయూ ఆపరేటర్లు సరాఫరా చేశారు. ఈ పథకం ద్వారా అందరికీ మేలు జరిగింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం జూన్ నెల నుంచి డీలర్ల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకోవాలంటోంది. ఆ వ్యవస్థను రద్దు చేయడం అంటే పేదల కడుపు కొట్టడమే.

- మంజునాథ, అమరాపురం

రేషన్‌కార్డులు, ఎండీయూ వాహనాల వివరాలు		
నియోజకవర్గం	రేషన్‌కార్డుల సంఖ్య	ఎండీయూ వాహనాల సంఖ్య
మడకశిర	78,136	54
హిందూపురం	83,988	61
పెనుకొండ	95,192	52

మాకు ఎంతో ఇబ్బంది



ఎండీయూ వాహనాల రద్దుతో రేషన్‌కార్డుదారులందరికీ ఇబ్బందే. రేషన్ కోసం రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న కంచిసముద్రానికి నడుచుకుని పోయి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఎండీయూ వాహనాలు ఉన్నప్పుడు కూలీ పనికి వెళ్లినా ఇంట్లో ఎవరో ఒకరు రేషన్ పొందేవాళ్లం. ఎండీయూ వాహనాల రద్దు వలన ఎలాంటి పనులకు వెళ్లకుండా కేవలం రేషన్ కోసమే వేచి చూడాల్సిన దుస్థితి.

- శ్రీనివాసులు, లేపాక్షి

గంటల తరబడి నిలబడాల్సిందే..



గతంలో ఇంటివద్దకు వాహనంలో వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు గంటల తరబడి నిలబడే ఇబ్బంది ఉండేది కాదు. అలాగే రేషన్ ఎప్పుడిస్తారనే దిగులు లేదు. ఇప్పుడు రేషన్ షాపు తెరిచారని తెలిస్తే చాలు పరుగులు తీసి క్యూలైన్లలో నిల్చోవాల్సి వస్తోంది. రేషన్ కోసం మళ్లీ పడిగాపులు కాస్తామనుకోలేదు.

- రత్నమ్మ, రైల్వేరోడ్డు, హిందూపురం

క్లుప్తంగా

శుభకార్యం



నూతన వధూవరులతో మాజీ మంత్రి శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లికి చెందిన గాండ్ల శ్రీరాములు, వెంకటలక్ష్మమ్మ కుమారుడు శివప్రసాద్ (స్టీఫెన్) వివాహ వేడుకకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట సర్పంచులు నాగార్జున, గంగాధర్, పరమేష్, స్థానిక ఎంపీటీసీ నాగేంద్రప్ప, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ ఫారుక్, నాయకులు మారుతీరెడ్డి, సూరి, రవిశేఖర్‌రెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, రాజారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను తీసుకెళ్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి గ్రామంలో బుధవారం కొల్హాపురి మహాలక్ష్మీదేవికి వైభవంగా జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయాన్ని ఒకరోజు ముందే గ్రామస్తులు వెళ్లి అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం గ్రామ సమీపాన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ప్రతిమకు మహిళలు జ్యోతులు సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు భాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, నాయకులు న్యాయవాది రంగనాథ్, పీసీ గిరి కాంతరాజు, భోజేగౌడ్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

జోరుగా విగ్రహ స్థాపన పనులు



విగ్రహ స్థాపన పనులు జరుగుతున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ప్రసిద్ధ సూగురు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న 45 అడుగుల అభయ ఆంజనేయ స్వామి ఏకశిలా విగ్రహం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వై.సీ.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు రాయల్ గోపాల్ తెలిపారు. సూగురు ఆలయ వెనుక భాగంలో శిలా విగ్రహం పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఏకశిలా విగ్రహ స్థాపన కోసం మరిన్ని ఏర్పాట్లు చేయడానికి దాతలు, భక్తులు సహకారం అందించాలని కోరారు.

వీరజవాన్ కుటుంబానికి పరామర్శ



వీరజవాన్ మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోరంట్ల: ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన మురళీనాయక్ కుటుంబ సభ్యులను బుధవారం కల్లి తండాలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధనరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలను ఓదార్చారు. అనంతరం మురళీనాయక్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తదితరులున్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి

హిందూపురం: పట్టణంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన మహేష్ (18) ఫిట్స్ వ్యాధితో మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మహేష్ ఇంట్లోనే ఫిట్స్ పడిపోయి అపస్మారక స్థితిలో ఉండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మహేష్ చనిపోయాడన్నారు.

కోర్టు ఆవరణలో నీటి సమస్య పరిష్కారం



కోర్టు ఆవరణలో నీటి సదుపాయం కోసం మోటర్, పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్పెషల్ కోర్టుల్లో నీటి సమస్య పరిష్కారం దిశగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు నీటి మోటార్‌ను ఏర్పాటు చేయించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్ట్ స్టాఫ్ సహకారంతో మోటారు, పైపులను అమర్చి కోర్టులకు నీటిని సరఫరా చేయడం జరిగిందన్నారు.

'యువగళం' హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

హిందూపురం టౌన్: 'తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగం అభివృద్ధికి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖామంత్రి నారా లోకేష్ అన్నార. సంవత్సరం గడచిపోతున్నా నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు'అని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఉమేష్ నాయక్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల విలీన ప్రక్రియ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారన్నారు. అలాగే మంత్రి నారా లోకేష్ అధికారం చేపట్టిన తరువాత జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3,500 కోట్ల ఫీజులు బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: హిందూపురం పట్టణ పరిధిలోని 33వ వార్డు ముద్దిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనర్ సదాశివరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, వేణురెడ్డి... సదాశివరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కౌన్సిలర్ మాతృమూర్తి మృతి

హిందూపురం పట్టణంలోని 2 వార్డు మున్సిపల్ కౌన్సిలర్ రామచంద్ర మాతృమూర్తి మంగమ్మ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త దీపిక కౌన్సిలర్ ఇంటికి వెళ్లి మంగమ్మ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ శివ, వైస్ చైర్మన్ జబీవుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేష్‌గౌడ్, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, రామాంజి, ఫారుక్, శ్రీనాథ్, సుబ్బు, నవీన్ తదితరులున్నారు.

ఈరలక్కప్పను విమర్శించడం సరికాదు

మడకశిర: నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను విమర్శించడం మానుకుని సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీఎం చంద్రబాబును నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగనాథ్ టీడీపీ నాయకులకు హితవు పలికారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కేవలం 25 ఓట్ల మెజార్టీతోనే ఈరలక్కప్పపై విజయం సాధించారనే విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. టీడీపీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ మానుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయాలన్నారు.

అడిగినంత ఇచ్చుకోవాల్సిందే!

- రేషన్‌కార్డులో మార్పులకు డబ్బు వసూళ్లు



ఎం కొత్తపల్లి గ్రామ సచివాలయం

రొద్దం: మండల పరిధిలోని ఎం కొత్తపల్లి గ్రామ సచివాలయంలో రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులకు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గౌరాజుపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి అనే వ్యక్తి తన కుమార్తె పేరును రేషన్ కార్డులో యాడ్ చేయడానికి బుధవారం సచివాలయాని వెళ్లాడు. అయితే సచివాలయ సిబ్బంది తన వద్ద రూ.100 వసూలు చేశారని తిమ్మారెడ్డి తెలిపారు. అలాగే సామాజిక పింఛన్ల కోసం భార్యా భర్తలను రేషన్ కార్డుల్లో నుంచి వేరు చేసి కొత్త కార్డులు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఇష్టారీతిలో డబ్బు వసూలు చేస్తున్నారని, తాము కట్టిన డబ్బుకు రసీదు ఇవ్వమంటే ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై 'సాక్షి' ఎంపీడీఓ రామ్‌కుమార్‌ను వివరణ కోరగా సర్వీస్ చార్జీలు మాత్రమే ఇవ్వాలన్నారు. డబ్బు ఎక్కువ తీసుకుంటున్నట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



పెనుకొండ: వెంకటేశ్వర థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

హిందూపురం: పట్టణంలోని గురునాథ్, అమృత్, లక్ష్మీ, వెంకటేశ్వర సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. థియేటర్లలో సదుపాయాలపై డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, ఆర్ఐ అమర్ పరిశీలించారు. మరుగుదొడ్లు, నీటి సదుపాయం, ప్రజలు కుర్చొడానికి సీట్లు, విద్యుత్తు సదుపాయం, అలాగే విశ్రాంతి సమయంలో ప్రజలకు విక్రయిస్తున్న తినుబండరాల నాణ్యతలను పరిశీలించారు. కొన్ని థియేటర్లలో నాణ్యత లేని తినుబండరాలు, సరైన తాగునీటి వసతులు లేకపోవడాన్ని గమనించి వెంటనే సదుపాయలు కల్పించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెనుకొండ రూరల్: పట్టణంలోని వెంకటేశ్వర, శ్రీనివాస సినిమా థియేటర్లను ఆర్డీఓ ఆనంద్ కుమార్ తనిఖీ చేశారు. థియేటర్‌లోని టికెట్ ధరలు, తినుబండారాల స్టాళ్లు, మరుగు దొడ్లను పరిశీలించారు. నిబంధనలకు లోబడే టికెట్లను విక్రయించాలన్నారు. నాణ్యమైన తినుబండారాలను మాత్రమే విక్రయించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలోని నంజుండేశ్వర సినిమా థియేటర్‌ను బుధవారం తహసీల్దార్ షేక్షావలి సిబ్బందితో కలిసి పరిశీలించారు. మౌళిక సదుపాయాలు, టికెట్, తినుబండారాల నాణ్యత ధరలపై ఆరా తీశారు. ఆర్ఐ గిరియప్ప, వీఆర్వో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జనన మరణాల నమోదులో అలసత్వం వద్దు



దేమకేతేపల్లి సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

చిలమత్తూరు: జనన మరణాల వివరాల నమోదులో అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు రికార్డులను పక్కాగా నమోదు చేయాలని జిల్లా జనన మరణ గణాంక అధికారి, నోడల్ అధికారి కళాధర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన డీపీహెచ్ఎన్ఓ వీరమ్మతో కలిసి మంగళవారం హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, చిలమత్తూరు మండలంలోని దేమకేతేపల్లి గ్రామ సచివాలయంలో గత మూడేళ్ల జనన మరణ నమోదు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, మాన్యువల్ రికార్డుల్లో నమోదు కచ్చితంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం గణాంకాల అధికారి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది అరవింద్ ఏఎన్ఎం, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



ఆర్డీఓ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, సిబ్బంది

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

లేపాక్షి పంచాయతీ కార్యదర్శిగా నాగరాజు

లేపాక్షి: లేపాక్షి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నాగరాజు బాధ్యతలను బుధవారం చేపట్టారు. పంచాయతీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ముగదాళబెట్ట'

పావగడ: తాలూకాలోని కేటీహళ్లి గ్రామ పంచాయతీస్థాయిలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నిలో ముగదాళబెట్ట జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప హాజరై విజేతకు ట్రోఫీ అందజేశారు.

బాలికల అదృశ్యం

పెనుకొండ: పట్టణంలోని కమాన్‌వీధికి చెందిన ఇద్దరు బాలికలు బుధవారం అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని కమాన్‌వీధికి చెందిన షేక్ రియాజ్ ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎస్ఓ



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న స్టాటిస్టికల్ ఆఫీసర్ కళాధర్

లేపాక్షి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్ఓ) కళాధర్, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పీహెచ్‌సీ సిబ్బందికి అవసరమైన సూచనలను అందచేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులకు జరిమానా విధించామన్నారు.

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామ సమీపంలోని సువర్ణముఖీ వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. మధుడికి చెందిన దేవరాజుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాత్కాలిక ఉద్యోగుల నిరసన

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా కర్ణాటక రాజ్య పౌర సేవా కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న సమ్మె నేపథ్యంలో స్థానిక మున్సిపల్ శాఖలో వివిధ విభాగాలకు చెందిన తాత్కాలిక ఉద్యోగులు సైతం నిరవధిక సమ్మెను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆందోళన కారులు స్పష్టం చేశారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

మడకశిర: తెనాలిలో పోలీసులు బహిరంగంగా దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన ముగ్గురు యువకులను కట్టేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం చట్టాలను ఉల్లంఘించడమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో విమర్శించారు. పోలీసులు చట్టాలను ఉల్లంఘించి కూటమి నాయకుల మెప్పు కోసం పని చేస్తున్నారన్నారు. దళితులను చావబాదిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

పరిగి: మండలంలో ఇంటర్ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండలానికి చెందిన 600 మందికిపైగా విద్యార్థులు ప్రతి ఏడాది ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ చదువుకోవాల్సి వస్తోందన్నారు. జూనియర్ కాలేజీను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రాన్ని అందించారు.

స్థలం పేరుతో మోసం చేశారని ఫిర్యాదు

హిందూపురం: పట్టణంలోని పలు వీధుల్లో నివాసముంటున్న మహిళలకు ఇంటిపట్టాలు ఇప్పిస్తామని కొందరు తమతో రూ.వేలు వసూలు చేసి మోసం చేశారని బాధితులు తహసీల్దార్ ఆఫీసు వద్ద బుధవారం నిరసన తెలిపారు. పట్టణంలోని కొల్లకుంట వద్ద సర్వే నంబర్ 21లో కొందరితోనే గుడిసెలు వేయించి తమకు అన్యాయం చేశారని లక్ష్మమ్మ, మునెమ్మ, యల్లమ్మ, లక్ష్మిదేవి, రమాదేవి, హసీనా తదితరులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులు వినతిపత్రమిచ్చారు.

కేబుల్ అపహరణ

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో మధుడి గొల్లహట్టి రోడ్డులో తాగునీటికి బోరుకి ఉన్న 40 మీటర్ల కేబుల్‌ను దొంగలు అపహరించారు. అలాగే మధూడిలోని సర్వేయర్ హనుమంతరాయప్ప చెందిన పొలంలో 7 హెచ్‌పీ రోటావేటర్ దానికి సంబంధించిన పనిముట్లను ఎత్తుకెళ్లారు. 30 మీటర్ల కేబుల్‌ను కూడా దొంగిలించారని బాధితుడు హనుమంతరాయప్ప తెలిపారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.